క్లుప్తంగా

వేధింపులపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని మడిబాక అరుంధతి వాడలో ఓ మహిళను వేధింపులకు గురిచేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం తెలిపారు. చాముండేశ్వరి(36)పై మడిబాక గ్రామానికి చెందిన మల్లికార్జున నాయుడు కులంపేరుతో దూషించి, వేధించి దాడి చేసినట్లు వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పంటలు పందుల పాలు


పందులు ధ్వంసం చేసిన వరిపంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో వరిపంటపై పందులు దాడి చేసి ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెంపకందారులు పందులను పొలాలపైకి తోలుతున్నారని, దీంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. పలుమార్లు పందుల పెంపకందారులను హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పందుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో షేక్ హయ్యద్ బాషా కుటుంబానికి శుక్రవారం వైఎస్సార్ బీమా ఆర్థిక సాయం అందజేశారు. హయ్యద్ బాషా(34) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సర్పంచ్ లలిత ద్వారా వైఎస్సార్ బీమాకు ఆయన దరఖాస్తు చేసి ఉన్నారు. దీంతో దహన సంస్కారాలకుగాను మృతుని కుటుంబానికి రూ.10 వేలు తక్షణ సాయాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకుడు కరుణాకరన్ పాల్గొన్నారు.

గౌరమ్మ ఊరేగింపు


కొత్తూరు గిరిజన కాలనీలో కోలాటాల సందడి

కేవీబీపురం: కనుమ ముగింపు సందర్భంగా మండలంలోని గిరిజనకాలనీల్లో గౌరమ్మ అమ్మవార్ల ఊరేగింపులు శుక్రవారం ఘనంగా జరిగాయి. కొత్తూరు, తిమ్మసముద్ర ం, దిగువ పుత్తూరు, రాగిగుంట, రాజులకండ్రిగ గిరిజన కాలనీల్లో గురువారం అర్ధరాత్రి నుంచి భక్తిశ్రద్ధలతొ గౌరమ్మ నోములు నోచారు. అన్నదానం చేశారు. శుక్రవారం సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి గంగ ఒడికి చేర్చారు.

పేకాట రాయుళ్లపై కేసు

శ్రీకాళహస్తి: మండలంలోని టీఎంవీ కండ్రిగలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీఎంవీ కండ్రిగ సచివాలయం సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని, రూ.5వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


వెంకట రమణ (ఫైల్)

శ్రీకాళహస్తి: మండలంలోని ముచ్చివోలులో శుక్రవారం విద్యుత్‌షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు ముచ్చివోలు గ్రామానికి చెందిన మద్దూరు వెంకట రమణ(36) ల్యాంకో కర్మాగారంలో పనిచేస్తున్నాడు. అదే గ్రామంలో తన అన్న నిర్మించుకున్న నూతన గృహంలో వెంకటరమణ వైరింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో గోడలో కట్టర్‌తో గాడులు తీస్తుండగా వైర్లు కట్ కావడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే పట్టణంలోని ఒక ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేయాల్సి ఉందని రూరల్ పోలీసులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


సాయం చేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం వాగివేడుకు చెందిన టి.వెంకటయ్య కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు ఆకర్ష్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఇటీవల అనారోగ్యంతో వెంకటయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వల నిండా చేపలు.. కార్మికులకు ఉపాధి

మత్స్యకార్మికులు జీవనోపాధి కల్పించాలన్న లక్ష్యంతో చెరువులు, జలాశయాల్లో ప్రభుత్వం చేప పిల్లలను వదులుతోంది. పిచ్చాటూరు అరణియార్‌లో ఏటా 10 లక్షల చొప్పున చేప పిల్లల విడుదలతో మత్స్య కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది 10 లక్షల చేప పిల్లల విడుదలకు మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వారం వ్యవధిలో ఈ ఏడాదికి సంబంధించి 10 లక్షల చేప పిల్లలను అరణియార్ రిజర్వాయర్‌లో వదిలేందుకు జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ ఉన్నతాధికారులు అనుమతించారు. ఇందులో 5 లక్షలు మృగాల రకం, 4 లక్షలు రోహు రకం, లక్ష కట్ల రకం చేప పిల్లలు ఉన్నాయి.

- అరణియార్‌లో చేప పిల్లల విడుదలకు సర్వం సిద్ధం
- వారంలో జలాశయంలో 10 లక్షల చేప పిల్లల విడుదల
- మృగాల, కట్ల, రోహు రకాలు ఎంపిక
- ఐదేళ్లలో ఏటా 10 లక్షలు చొప్పున చేపపిల్లల విడుదల
- మత్స్యకార్మికులకు చేయూత ఇవ్వడమే లక్ష్యం


వదిలేందుకు సిద్ధం చేసిన చేప పిల్లలు


పూర్తి స్థాయిలో నిండి కళకళలాడుతున్న అరణియార్ జలాశయం

పిచ్చాటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అరణియార్ జలాశయంలో ఏటా 10 లక్షల చొప్పున నాలుగేళ్ల పాటు 40 లక్షలు పిల్లలను విడుదల చేశారు. ఈ ఏడాదికి సంబంధించి మరో 10 లక్షల పిల్లలను ప్రాజెక్టులో వదిలి మత్స్యసంపద అభివృద్ధికి కృషి చేస్తుంది. అరణియార్ ఇలా వరుసగా ఐదేళ్ల మొత్తం 50 లక్షలు చేప పిల్లలను విడుదల చేసిన దాఖలాలు ఇప్పటి వరకు లేవని మత్స్య కార్మికులు చెబుతున్నారు. అరణియార్ మత్స్య కేంద్రంలో పెంచుతున్న 10 లక్షల చేప పిల్లలు గత నెల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో అధికారులు కల్యాణీ డ్యామ్ నుంచి 10 లక్షల చేప పిల్లలు తెచ్చి జలాశయంలో వదలనున్నారు. 2020, 2021, 2023 సంవత్సరాల్లో గరిష్ఠ స్థాయి వరదలతో అరణియార్ గేట్లు పైకెత్తి భారీగా నీటిని కిందికి వదిలారు. ఆ సమయంలో మత్స్య కేంద్రం నీటిలో మునిగి చేప పిల్లలన్నీ సముద్రంలోకి కొట్టుకుపోయాయి. అయినా అరణియార్‌లో చేపపిల్లలను వదలడం ఆపలేదు.

2 వేల కుటుంబాలకు జీవనోపాధి

అరణియార్‌లో చేపలు పెంపకం వల్ల పిచ్చాటూరుతో పాటు నింద్ర, కేవీబీ పురం మండలాల్లోని సుమారు 2 వేల మత్స్య కార్మిక కుటుంబాలకు జీవనోపాధి కలుగుతోంది. ప్రధానంగా మూడు మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలు అరణియార్‌లో చేపల పెంపకం ద్వారానే జీవనం సాగిస్తున్నాయి.

ఏడాదికి రూ.410 లైసెన్సు ఫీజు

ప్రాజెక్టులో చేపలు పట్టే మత్స్య కార్మికులు ఏడాదికి ఒకసారి రూ.410లు చెల్లించి ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందవచ్చు. లైసెన్స్‌లు పొందిన వారం దరూ ఏడాది వరకు జలాశయంలో చేపలు పట్టి అమ్ముకోవచ్చు. లైసెన్స్ ఉన్న మత్స్యకార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని పథకాలు వర్తిస్తాయి.

ఈ ప్రభుత్వంలో ఉచితం



గత ప్రభుత్వంలో ప్రాజెక్టులో చేప పిల్లలు వదలాలంటే అందుకు అయ్యే ఖర్చులో 50 శాతం మా మత్స్యకార్మిక సొసైటీ నుంచి వసూలు చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఐదేళ్లుగా ఉచితంగా వదులుతున్నారు. జలాశయంలో సంవృద్ధిగా నీరు ఉండడం వల్ల ఎక్కువ సంఖ్యలో చేపలు ఉన్నాయి. ప్రాజెక్టు ఇంకిపోకుండా నీరు ఉండడం వల్ల చేప సైజు భారీగా పెరిగుతోంది. మత్స్యకార వృత్తి తోనే నా కుటుంబం గడుస్తుంది. జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–క్రిష్ణన్, మత్స్య కార్మికుడు, పిచ్చాటూరు

ప్రభుత్వ సహకారం బాగుంది



మాకు ప్రభుత్వ సహకారం బాగా ఉంది. లాక్‌డౌన్ సమయంలో కూడా 30 లక్షల చేపపిల్లలను ప్రాజెక్టులో వదిలి ఆదుకున్నారు. ఆ తరువాత కూడా ఏటా 10 లక్షల చొప్పున చేప పిల్లలను వదులుతున్నారు. మత్స్య కార్మికుల కోసం కీళపూడిలో ప్రత్యేకంగా జగనన్న కాలనీని తీర్చి దిద్ది, ఇళ్లపట్టాలు ఇప్పించారు. ఈ 5 ఏళ్లు పొందిన మేలు గతంలో ఎప్పుడూ మేము పొందలేదు.

–తిరుమల రెడ్డి, మత్స్య కార్మికుడు, పిచ్చాటూరు

ఏర్పాట్లు చేస్తున్నాం



మరో వారం రోజుల్లో చేపపిల్లలను ప్రాజెక్టులో వదిలేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్, మత్స్య శాఖ ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే అనుమతి పొందాం. ఈ ఏడాదితో కలిపితే ఐదేళ్లపాటు 50 లక్షల చేప పిల్లలు జలాశయంలో వదిలినట్లే. దీంతో పాటు నాలుగు ఫిష్ ఆంధ్ర యూనిట్‌లు సైతం పిచ్చాటూరుకు మంజూరై నడుస్తున్నాయి.

–వెంకటరమణ, ఎఫ్‌డీఓ, అరణియార్ మత్స్య కేంద్రం, పిచ్చాటూరు

ముమ్మరంగా కుల గణన సర్వే


సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది


వరదయ్యపాళెం: సర్వే చేస్తున్న సిబ్బంది

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట సచివాలయ పరిధిలోని 240 గృహాల్లో నివసిస్తున్న ప్రజల వివరాలను కులగణన సర్వేలో సేకరిస్తున్నారు. శుక్రవారం కొత్తమారికుప్పం, కాళమనాయుడుపేట, నరసరాజు అగ్రహారంలో సర్వే చేపట్టారు. వ్యక్తులపేర్లు, వయస్సు, వ్యవసాయ భూమి, నివాసభూమి, వృత్తి, పశుసంపద సమాచారం, వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయం, కులం, ఉపకులం, మతం, విద్యార్హతలు, ఇంటి రకం, సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, గ్యాస్ వివరాలు నమోదు చేస్తున్నారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం డి.రోసిలిన్, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.శామ్యూల్, డిజిటల్ అసిస్టెంట్ ఎస్.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండలంలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని 29 పంచాయతీల్లో స్థానిక సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతున్నారు. తహసీల్దార్ గౌరిశంకరరావు, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు సర్వేను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 33 కేవీ, 11 కేవీ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా యోగి వేమన జయంతి


కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి సంఘం సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద శుక్రవారం యోగి వేమన 612వ జయంతిని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చెంచెరెడ్డి హాజరై వేమన చిత్రపటానికి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ వేమన విగ్రహారాధనకు, కులమతాలకు అతీతమన్నారు. అన్ని వర్గాలకు చెందిన వ్యక్తిగా ఆయన ప్రకటించుకున్నారని తెలిపారు. ఆయన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారని, తెలుగు భాష గొపదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ఆయన రచించిన ఎన్నో పద్యాలు నేటి ఆధునిక యుగంలో చేపడుతున్న పరిశోధనలకు ఆధారంగా నిలస్తున్నాయని తెలిపారు. అన్ని రకాల సమాజిక పరిస్థితులకు అద్దం పట్టేలా వేమన రచనలు సాగాయని, ఇలాంటి కవి ఉండడం తెలుగు ప్రజలకు గౌరవమన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు వేమన పద్యాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. కన్నలి ప్రభాకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, చెంచురెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడి


సూచనలిస్తున్న ఏడీఏ లక్ష్మీదేవి


మాట్లాడుతున్న ఏడీ గోపీనాయక్

నాయుడుపేట: ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని ద్వారకాపురంలో వరిలో యాజమాన్యం– తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకే ఎరువులు వాడాలన్నారు. ఆకుచుట్టు పురుగు, అగ్గితెగుళ్ల, కాండం తొలుచు పురుగు, పాముపొడ తెగుళ్ల నివారణకు సకాలంలో మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనివాసులు, గణేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

గూడూరురూరల్ : వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లు నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు మేరుగ భాస్కరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నూరు ఆర్‌బీకే ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గూడూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.గోపీనాయక్, ఏఓ వి.రమేష్, వీఏఏ కె.శ్రీవిద్య పాల్గొన్నారు.

స్కూటరిస్ట్‌కు గాయాలు

ఏర్పేడు: మండలంలోని మూలకండ్రిగ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ గాయపడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం.. మండలంలోని గుండ్లకండ్రిగ ఎస్టీకాలనీకి చెందిన హరికృష్ణ(24) ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. మూలకండ్రిగ వద్ద ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన అతన్ని చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ కృష్ణయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి


పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులందరు సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె శుక్రవారం మండలంలోని పుత్తేరి, పీవీకండ్రిగ, ఆలత్తూరు గ్రామాల్లో పంట పొలాల వద్దకు వెళ్లి ఈ–క్రాప్ బుకింగ్ చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధరపై పంటల కొనుగోలు తదితరాలకు అర్హులు అవుతారన్నారు. పీఎం కిసాన్, ఈకేవైసీ, ఆర్బీకేల ద్వారా సరఫరా అవుతున్న ఎరువులు తదితరాలను వివరించారు.

వైభవంగా పేరంటాలమ్మ గ్రామోత్సవం



సత్యవేడు: పట్టణంలో పేరంటాలమ్మ దేవతకు శుక్రవారం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు మురళి ఆధ్వర్యంలో దీప, ధూప, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటి వద్ద భక్తులు కొబ్బరి కాయలు కొట్టి హారతులు పట్టారు. మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

25న భారత రాజ్యాంగం - నైతికతపై సదస్సు

తిరుపతి కల్చరల్: పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై చైతన్యం కలిగించడమే లక్ష్యంగా ఈ నెల 25వ తేదీన ఎస్వీయూలోని సెనేట్ హాల్‌లో భారత రాజ్యాంగం – నైతికతపై సద స్సు నిర్వహిస్తున్నట్లు పౌర చైతన్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు హక్కులతో పాటు బాధ్యతలను వివరించి వారిని చైతన్య పరచడమే తమ వేదిక లక్ష్యమన్నారు. సీనియర్ పాత్రికేయుడు రాఘవ శర్మ, పరమేశ్వరరావు, ముషీర్‌అహ్మద్, రుద్రరాజు, నాగరాజు పాల్గొన్నారు.

చిమ్నీలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు అందజేత


చిమ్నీలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చండీహోమం, రుద్ర హోమం నిర్వహించే మండపాల్లో అమర్చేందుకు హైదరాబాద్‌కు చెందిన మేడుకొండూరు మోహన్‌రావు, పార్వతి, కృష్ణ చైతన్య, రాజ్యలక్ష్మి రూ.80 వేలు విలువ చేసే చిమ్నీలు 2, ఎగ్జాట్ ఫ్యాన్లను అందజేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయంలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, ద్వారక తిరుమల ఈవో త్రినాథరావు దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి వీరికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

108, 104కు నీడ కావాలి


చెట్ల కింద ఉన్న 104 వాహనం


ఆరుబయట ఉన్న 108 అంబులెన్స్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలకు సేవలందిస్తున్న 108, 104 అంబులెన్స్ వాహనాలను పార్క్ చేసేందుకు మండల కేంద్రంలో షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. పని చేసే సిబ్బంది ఉండేందుకు కూడా గది లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతం. వాహనాలను పార్క్ చేసేందుకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గదిని కేటాయించాలని సిబ్బంది పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా అతీగతీ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం


నారాయణవనం: మందుల కిట్ల అందజేత


శ్రీకాళహస్తి: ఆరోగ్య సురక్ష కార్డుల పంపిణీ

నారాయణవనం: ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలకు జగనన్న సురక్షతో మెరుగైన వైద్య సలహాలు, చికిత్సలు అందుతున్నాయని భీమునిచెరువు సర్పంచ్ మురుగేశం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని భీమునిచెరువు సచివాలయంలో జగనన్న సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి కిట్లను అందజేశారు. సచివాలయ పరిధిలో 128 మంది వైద్య పరీక్షలను చేయించుకున్నారని మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ తెలిపారు. ప్రాథమిక పరీక్షలను నిర్వహించి, సలహాలను, సూచనలను ఇచ్చి, మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి రక్ష

శ్రీకాళహస్తి: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధ్యాం ఇస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదల ఆరోగ్యం పట్ల అలక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపించారు. అనంతరం శిబిరానికి విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. చెర్లోపల్లి సచివాలయ కన్వీనర్ ఎం. వెంకటేష్, గోవిందరెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేష్, పసల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఖాదర్‌వల్లి గంధోత్సవం


వేడుకల్లో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని ఖాదర్‌వలి గంధోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి పాల్గొన్నారు. దర్గాకమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు మునీర్ ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆమె మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి ఎమ్మెల్యే ఎంతో కృషిచేస్తున్నారన్నారు. వారికి ఆయన అన్నలా, మేనమామలా ఉంటూ అండగా ఉంటూ పలు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినటు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గఫార్, బాబు, బాషా, మునిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, అమాన్, శివ, ఖలీల్, కనాన, అనాస్, సల్మాన్, మహబూబ్‌బాషా, మునిలక్ష్మి, మాధవి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ సిరాజ్‌బాషా, గోరా, ఫతాన్ ఫరీద్, బావాజీ, జిలానీ, షర్మిలతాగూర్, అబూ, షబీర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ


సూచనలిస్తున్న అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు

చిల్లకూరు : మండలంలోని తమ్మినపట్నంలో అదానీ ఫౌండేషన్, బయోప్ కంపెనీల ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల తయారీపై మహిళలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. అదానీ ఫౌండేషన్ హెచ్‌ఓడీ రాజేష్ రంజన్ మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల మహిళలు తమ ఇళ్ల వద్ద చెత్త సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. చెత్త, పేడను కుప్పగా పోసి వాటిని ఆరబెట్టి వానపాములు వదిలితే 15 రోజుల్లో అది ఎరువుగా మారుతుందని వెల్లడించారు. అనంతరం ఎరువును బాగా జల్లించి ప్యాకెట్ల రూపంలో రైతులకు అమ్ముకోవచ్చని సూచించారు. ఈక్రమంలో స్థానిక వర్మీకంపోస్ట్ యార్డ్‌లను సందర్శించారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, రిసోర్స్ పర్సన్ సుబ్బారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమ సమాజ న్యాయం కోసమే నవ సోషలిజం

తిరుపతి కల్చరల్: సమాజంలో నూతన ఒరవడిని తీసుకురావడానికి, ప్రతి ఒక్కరికీ సమ న్యాయం కల్పించాలనే లక్ష్యంతో నవ సోషలిజం పార్టీని ఏర్పాటుచేసినట్టు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పి.ఆనంద తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నవ సోషలిజం పార్టీ లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా తమ పార్టీ పనిచేస్తుందన్నారు. మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్ర బోస్, అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే వంటి మహనీయుల ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని చెప్పారు. పార్టీ ప్రతినిధులు సూరిబాబురెడ్డి, రఘుబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.